క్లుప్తంగా

పరపతి సంఘం కార్యవర్గం ఎన్నిక



పర్వతగిరి : మండల కేంద్రంలోని వివేకానంద పరపతి సంఘం కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ముక్కెర సుధాకర్, ఉపాధ్యక్షుడిగా బైరి అశోక్, ప్రధాన కార్యదర్శిగా జంగ ప్రసాద్, సహాయ కార్యదర్శిగా వన్నాల రాజశేఖర్, కోశాధికారిగా కూసం ప్రవీణ్, ఆర్గనైజర్‌గా పుల్లూరి రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధాకర్, ప్రసాద్ మాట్లాడారు. పరపతి సంఘం ఉన్నతికి కృషి చేస్తామన్నారు. వార్షిక ఆదాయం రూ.24 లక్షలు దాటిన సందర్భంగా కమిటీని అభినందించారు. తొలుత 12వ వార్షికోత్సవ సంబురాలు నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం గౌరవ అధ్యక్షుడు ఎర్రబెల్లి హరికుమార్, వ్యవస్థాపకుడు జంగ వీరమల్లు, మధ్యబోయిన సంతోశ్, నీరటి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 1996–97 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న పూర్వవిద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. బండి రాజ్‌కుమార్, ఆకుతోట రాజు, చీకటి విక్రమ్ ఆధ్వర్యంలో పూర్వవిద్యార్థులు ములుగు జిల్లాలోని మల్లూరు శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చితామణి జలపాతం, ఇతర పర్యటక ప్రాంతాలను సందర్శించి సందడి చేశారు.

ఆర్థికసాయం



ఖానాపురం : మండలంలోని మనుబోతులగడ్డకు చెందిన అశోక్ ఇటీవల ఆత్మహత్య చేసుకోగా బాధిత కుటుంబానికి అతడి స్నేహితులు ఆదివారం రూ.50 వేల సాయం అందించారు. తొలుత అశోక్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం స్నేహితులు సమకూర్చిన రూ.50 వేల అశోక్ కుమార్తె పేరిట డిపాజిట్ చేసిన బాండ్, పాస్‌బుక్‌ను బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో అశోక్ స్నేహితులు మస్తాన్, రాజు, మధు, సుమన్, శ్రీను, రవి, రాజశేఖర్, ఐలోని తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ



నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన ఫోరండ్ల రాజు ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాన్ని ప్రియదర్శిని క్లబ్ కన్వీనర్ చల్లా రఘోత్తంరెడ్డి ఆదివారం పరామర్శించారు. తొలుత రాజు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబానికి రూ.2 వేల నగదుతోపాటు క్వింటా బియ్యం సాయంగా అందజేశారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బండా రంజన్ రెడ్డి, కోకన్వీనర్ గోరంట్ల వెంకట్‌నారాయణ, సభ్యులు మూసిన సారయ్య, రామారపు భద్రయ్య, నేతుల సారంగపాణి, చల్లా కమలాకర్‌రెడ్డి, పొట్లపల్లి వీరస్వామి, రాయరాకుల సాంబయ్య, ఫోరండ్ల శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గ్రామసభలు

సంగెం : మండల పరిధిలోని గ్రామాల్లో రేపటి (మంగళవారం) నుంచి సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక కోసం గ్రామసభలు నిర్వహిస్తామని ఎంపీడీఓ కాసర్ల రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, రైతు భరోసా, తదితర పథకాలకు అర్హులను సభల్లో ఎంపిక చేయనున్నట్లు పేర్కొన్నారు. 21న చింతపల్లి, గవిచర్ల, ఎల్గూర్ రంగంపేట, కాట్రపల్లి, లోహిత, మొండ్రాయి, నార్లవాయి గ్రామాల్లో, 22న తీగరాజుపల్లి, రామచంద్రాపూర్, కాపుల కనిపర్తి, సంగెం, గుంటూరుపల్లి, ముమ్మడివరం, పల్లారుగూడ గ్రామాల్లో, 23న తిమ్మాపూర్, నల్లబెల్లి గ్రామాల్లో, 24న వెంకటాపూర్, షాపూర్ గ్రామాల్లో సభలు ఉంటాయని వివరించారు. ప్రజలు అభ్యంతరాలు ఉంటే సభ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అభ్యంతరాల పరిశీలన అనంతరం తుది జాబితాను ప్రభుత్వానికి అందజేస్తామని పేర్కొన్నారు.

విద్యుత్ కోత.. ఎండుతున్న పంటలు

- బావులకు సరఫరా నిలిపివేత
- సుమారు 70 ఎకరాలకు నష్టం



ఎండిపోతున్న మొక్కజొన్న పంట

చెన్నారావుపేట : విద్యుత్ కోతలతో మొక్కజొన్న పంటలు ఎండుతున్న దుస్థితి మండలంలోని కాల్ నాయక్ తండా పరిధిలో చోటు చేసుకుంది. కాల్ నాయక్ తండా పరిధిలోని ఎస్ఎస్1 ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా వ్యవసాయ బావులకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా అవుతోంది. అయితే కొంత మంది రైతులు బిల్లులు చెల్లించకపోవడంతో అధికారులు, సిబ్బంది రెండ్రోజుల క్రితం త్రీఫేస్ విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో రెండ్రోజులుగా విద్యుత్ సరఫరా కాక పంటలు ఎండిపోతున్నాయని రైతులు గుగులోతు నరేశ్, బానోతు రమేశ్, జంపన్న మీడియాకు తెలిపారు. ఎస్ఎస్1 ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా విద్యుత్ సరఫరా అవుతున్న బావుల ద్వారా సుమారు 70 ఎకరాల్లో పంట సాగవుతుండగా ఆ మేరకు పంటలు ఎండిపోతున్నట్లు తెలుస్తోంది. సమస్య ఆదివారం సాయంత్రం వెలుగులోకి వచ్చింది. రైతులు విద్యుత్ సరఫరా కోసం లైన్‌మెన్, జేఎల్ఎంలను కోరగా నిర్లక్ష్యంగా సమాధానమిచ్చినట్లు సమాచారం. బిల్లులు తీసుకొచ్చి కడితే విద్యుత్ సరఫరా చేస్తామని సిబ్బంది చెప్పారని రైతులు వాపోయారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేసి పంటలు ఎండిపోకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

ఒక డీటీఆర్ మాత్రమే ఆఫ్ చేశాం

కాల్‌నాయక్ తండా పరిధిలోని బావుల వద్ద కనెక్షన్లు ఉన్న కొందరు రైతులు బిల్లులు చెల్లించలేదు. ఈ క్రమంలో ఒక డీటీఆర్ మాత్రమే ఆఫ్ చేశాం. బకాయి ఉన్న రైతులు బిల్లులు చెల్లిస్తే ఎస్ఎస్1 ట్రాన్స్‌ఫార్మర్ ద్వారా బావులకు విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తాం. రైతులు సకాలంలో బిల్లులు చెల్లించి సహకరించాలి.

\- రాంచందర్, లైన్‌మెన్

చెన్నమల్ల నర్సయ్య సేవలు మరువలేనివి

- మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి



సభలో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి

నల్లబెల్లి : సర్పంచ్‌గా చెన్నమల్ల నర్సయ్య (కిష్టన్న) అందించిన సేవలు మరువలేనివని బీఆర్ఎస్ నేత, నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి అన్నారు. మండలంలోని నారక్కపేటలో ఏర్పాటు చేసిన నర్సయ్య స్తూపాన్ని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులతో కలిసి మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సుదర్శన్‌రెడ్డి మాట్లాడారు. నర్సయ్య న్యూడెమోక్రసీ అజ్ఞాత జీవితాన్ని వదిలి జనజీవన స్రవంతిలోకి వచ్చి సర్పంచ్‌గా, ఉపసర్పంచ్‌గా, పీఏసీఎస్ డైరెక్టర్‌గా ప్రజలకు సేవలు అందించారని తెలిపారు. విప్లవ ప్రజాపోరాటాల్లోనూ క్రియాశీలకంగా పాల్గొన్నారని చెప్పారు. నాయకులు నర్సయ్య స్ఫూర్తితో ప్రజలకు సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్, సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పాయం చిన్న చంద్రన్న, జిల్లా నాయకుడు ప్రభకరన్న, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి, పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, నాయకులు ఈర్ల పైడి, కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, గందె శ్రీనివాస్ గుప్తా, దామ సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు



గీసుకొండ : గుడుంబా నిర్మూలనకు ఎక్సైజ్ శాఖ సిబ్బంది మండలంలో దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ తాతాజీ తెలిపారు. ఆదివారం రూట్‌వాచ్ నిర్వహించి నందనాయక్ తండా నుంచి గీసుకొండకు బైక్‌పై రవాణా చేస్తున్న భూక్యా రాజు, మమతను అరెస్టు చేసి బైక్, 20 లీటర్ల గుడుంబా, ఫోన్ స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. జాన్‌పాకలో గుడుంబా తయారీ స్థావరాలపై దాడులు చేసి వాంకుడోత్ అఖిల్, గంధ్రకోట విజయ, తేజావత్ సురేశ్, కస్నా అరెస్టు చేసి, వారి నుంచి 20 లీటర్ల గుడుంబా, నాలుగు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్సైలు జ్యోతి, పద్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బుధరావుపేటలో..

ఖానాపురం : మండలంలోని బుధరావుపేటలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నాజీతండాకు చెందిన భూక్య హుస్సేన్ అక్రమంగా తరలిస్తున్న 10 లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి తెలిపారు. గుడుంబ నిర్మూలనలో భాగంగా గ్రామంలో వాహనాల తనిఖీ చేపట్టినట్లు చెప్పారు. గుడుంబాతోపాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు. తనిఖీలో ఎక్సైజ్ పోలీసులు నాగరాజు, దిలీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయం

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు విజయ్



రాయపర్తి : మాట్లాడుతున్న విజయ్

రాయపర్తి : ఎస్సీ వర్గీకరణ సాధనే ధ్యేయంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ ఆధ్వర్యంలో ఉద్యమ కార్యాచరణ కొనసాగిస్తున్నట్టు రాష్ట్ర నాయకుడు కందికట్ల విజయ్ తెలిపారు. మండలంలోని కొత్తూరులో ఆదివారం నిర్వహించిన ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ హామీని పాలకులు విస్మరించారని విమర్శించారు. హైదరాబాద్‌లో లక్ష డప్పులు, వేల గొంతుకల కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. లక్ష డప్పులు, వేల గొంతుల కార్యక్రమానికి మాదిగ కులస్తులందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కందికట్ల సురేశ్, కందికట్ల శ్రీను, హరిబాబు, సీనపెల్లి రమేశ్, సీనపెల్లి రాజు, కూశనపల్లి అశోక్, కందికట్ల కొమురయ్య, నాగయ్య, కృష్ణయ్య, రాజ్‌కుమార్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

సంగెం : మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ గుండేటి బాబు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రదర్శనలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బిర్రు మహేందర్ మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేపట్టి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతాళ్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, మండల అధ్యక్షుడు దామెర కిశోర్, నాయకులు రవికుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

నల్లబెల్లి : మండలంలోని మేడపల్లికి చెందిన మామిడి పల్లి ఈశ్వరమ్మ–మల్లయ్య దంపతుల కుమారుడు రాజు (25) గుండెపోటుకు గురై ఆదివారం మృతి చెందాడు. రాజు మృతితో అతడి తల్లి రోదనలు మిన్నంటాయి. రాజు ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ కుటుంబ పోషణలో తల్లికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం మలవిసర్జన కోసం చెరువు కట్టకు వెళ్లాడు. ఛాతి నొప్పితో కుప్పకూలిపోయాడు. గమనించిన స్థానికులు, కుటుంబ సభ్యులు నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. రాజు మృతదేహానికి తల్లి తలకొరివిపెట్టి అంత్యక్రియలు పూర్తి చేసింది. రాజు మృతితో మేడపల్లిలో విషాదం నెలకొంది.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

దుగ్గొండి : మండలంలోని గిర్నిబావిలో ప్రమాదవశాత్తు రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికి మరొకటి ఢీకొట్టగా ఒకరికి తీవ్ర గాయాలైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. తొగర్రాయికి చెందిన రైతు చల్ల విష్ణువర్ధన్‌రెడ్డి తొగర్రాయికి వెళ్తుండగా నర్సంపేట నుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో విష్ణువర్ధన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం వరంగల్‌కు తరలించారు.

ప్రైవేట్ బస్సు ఢీకొని..

గీసుకొండ : మండలంలోని మచ్చాపురం సమీపంలో ఆదివారం రాత్రి ఎడ్ల బండిని ఓ ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. దీంతో ఎడ్లబండిపై ఉన్న రైతుకు, ఎద్దుకు గాయాలయ్యాయి. ఎస్సై ప్రశాంత్ వివరాలు తెలిపారు. అర్జ్యాతండాకు చెందిన వీరన్న ఎడ్లబండి పై వ్యవసాయ బావికి వెళ్లి తిరిగి వస్తుండగా మచ్చాపురం వద్ద మహబూబాబాద్ నుంచి వరంగల్ దిశగా ప్రయాణిస్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొట్టింది. వీరన్నను స్థానికులు చికిత్స కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు.

నేటి ప్రదర్శనను విజయవంతం చేయాలి



నర్సంపేట : సమావేశంలో మాట్లాడుతున్న ప్రణయ్‌దీప్

- ఎంఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు ప్రణయ్‌దీప్

నర్సంపేట : హనుమకొండలో నేడు (సోమవారం) నిర్వహించనున్న డప్పు కళాకారుల ప్రదర్శనను విజయవంతం చేయాలని మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జిల్లా అధ్యక్షుడు కల్లెపల్లి ప్రణయ్‌దీప్ కోరారు. పట్టణంలోని తెలంగాణ అమరవీరుల స్తూపం వద్ద ఆదివారం నిర్వహించిన కళాకారుల ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడారు. సోమవారం హనుమకొండలోని వేయి స్తంబాల గుడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ప్రదర్శన నిర్వహిస్తామన్నారు. ప్రదర్శనకు మండలంలోని డప్పు కళాకారులందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తడుగుల విజయ్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్, డప్పు కళాకారుల సంఘం డివిజన్ అధ్యక్షుడు అబ్బదాసి యాకయ్య, నాయకులు మునిగె యాకూబ్, కొకనూరు నిరంజన్, మదార్, అబ్బదాసి అశోక్, కన్నం కుమార్, గుండె చంటి, జన్ను శ్రీకాంత్, కన్నం సతీశ్, సాగర్, శ్రీను, సాంబయ్య, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

చెన్నారావుపేట : మండలంలోని ఉప్పరపల్లిలోని అంబేద్కర్ జంక్షన్‌లో నిర్వహించిన డప్పు కళాకారుల ప్రదర్శనలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు బొమ్మెర రవీందర్ మాట్లాడారు. నేడు వరంగల్, హనుమకొండలో నిర్వహించే డప్పు ప్రజా ప్రదర్శనకు డప్పు కళాకారులు, కవులు, గాయకులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు అబ్బదాసి యాకయ్య, నాయకులు చిలపాక పెద్ద యాకయ్య, బాబు, కొమ్మాలు, జన్ను రవి, వీరేశం, తదితరులు ఉన్నారు.

జాబ్ కార్డు లేకున్నా 'భరోసా' ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న కృష్ణ, గ్రామస్తులు

రాయపర్తి : ఉపాధి హామీ జాబ్‌కార్డు లేకున్నా పేద రైతు కూలీలకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సాయం అందించాలని సామాజిక ఉద్యమకారుడు చిలుముల కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో గ్రామస్తులు ఏఓఈ కావ్య, జూనియర్ అసిస్టెంట్ శిరీష, టెక్నికల్ అసిస్టెంట్ కృష్ణారెడ్డి, పంచాయతీ కార్యదర్శి అజీజ్‌పాషాలకు ఆదివారం వినతిపత్రం అందజేశారు. అనంతరం కృష్ణ మాట్లాడారు. ఓవైపు ఆదాయ పన్ను చెల్లిస్తున్న రైతులకు రుణమాఫీ చేస్తూనే మరోవైపు భూస్వాములకు రూ.500 బోనస్ ఇస్తుండగా పేద రైతు కూలీలకు జాబ్‌కార్డు ప్రామాణికంగా నిర్ణయించడం సరికాదన్నారు. నెలకు 20 రోజులు ఉపాధి హామీ పనులు చేస్తేనే రూ.12 వేలు ఇస్తామని, ఇతర నిబంధనలు తొలగించి పేద కూలీలందరికీ రైతు భరోసా ఇవ్వాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు చిలుముల ఎల్లమ్మ యాకయ్య, మొలుగూరి పున్నమయ్య, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇన్సూరెన్స్ డే వేడుక

చెన్నారావుపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచిలో నేడు (సోమవారం) మెగా ఇన్సూరెన్స్ డే వేడుక నిర్వహిస్తామని మేనేజర్ మోహన్‌కాంత్ తెలిపారు. ఆయన విలేకరులతో ఆదివారం మాట్లాడారు. ఆటో, ట్రాక్టర్, లారీ, ఇతర వాహనాలు నడిపే డ్రైవర్లందరూ ఇన్సూరెన్స్‌ను వినియోగించుకోవాలని సూచించారు. రూ.2 వేల ప్రీమియం చెల్లిస్తే ఏడాది పాటు ప్రమాద వైకల్యానికి రూ.20 లక్షల, ప్రమాద మృతికి రూ.40 లక్షల బీమా ఉంటుందని తెలిపారు. బ్యాంకులో ఖాతా కలిగిన అర్హులు ఇన్సూరెన్స్ తీసుకోవాలని కోరారు.

భూముల కబ్జాను సహించేది లేదు

- టీపీసీసీ సభ్యుడు రామానంద్



మాట్లాడుతున్న రామానంద్

నర్సంపేట : నియోజకవర్గంలో భూకబ్జాలను సహించేది లేదని టీపీసీసీ సభ్యుడు పెండెం రామానంద్ స్పష్టం చేశారు. పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని కొందరు చదును చేసి కబ్జాకు యత్నిస్తున్నారన్న సమాచారం మేరకు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి ఆదేశాలతో రామానంద్ ఆధ్వర్యంలోని బృందం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలోని చదును చేసిన భూమిని ఆదివారం సందర్శించి పరిశీలించింది. ఈ సందర్భంగా రామానంద్ మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ భూముల కబ్జాలకు తావులేదన్నారు. ప్రభుత్వ భూములను కబ్జాల నుంచి కాపాడతామని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేయని అరాచకం లేదన్నారు. నియోజకవర్గంలో భూదందాలు, రియల్ ఎస్టేట్ పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ వ్యక్తుల భూములను ఆక్రమించిన దుర్మార్గపు చరిత్ర బీఆర్ఎస్ సొంతమన్నారు. కళాశాల భూమిని అన్యాక్రాంతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, ఉపాధ్యక్షుడు వంశీకృష్ణ, ఓబీసీ జిల్లా అధ్యక్షుడు ఓర్సు తిరుపతి, కౌన్సిలర్లు ఎలకంటి విజయ్‌కుమార్, ములుకల వినోద, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు తుమ్మలపల్లి సందీప్, నాయకులు బిట్ల మనోహర్, జన్ను మురళి, మోటం రవికుమార్, చిప్ప నాగ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ముందుకు రావాలి



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

- ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు

వర్ధన్నపేట : గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు ముందుకు రావాలని స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజు ఆకాంక్షించారు. మండలంలోని బొక్కలగూడెంలో ఎస్ఎల్ఐటీ, ఆక్యులోర్ స్టాటిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఆర్థికసాయంతో ఏర్పాటు చేసిన రూ.2 లక్షల విలువైన ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. కంపెనీ ఉద్యోగులు, యాజమాన్యం గ్రామ ప్రజలకు స్వచ్ఛమైన నీరు అందించే దిశగా చొరవ చూపడం అభినందనీయమని చెప్పారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన సదుపాయాలు కల్పించడంలో ప్రభుత్వం ముందుంటుందని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన అభివృద్ధికి మించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని గ్రామాల్లో ప్రజలకు తాగునీటి, రోడ్లు, డ్రెయినేజీలు, ఇతర వసతులు కల్పించేలా అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. దాతలు సైతం ముందుకొస్తే గ్రామాలు మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుందన్నారు. అనంతరం ఎమ్మెల్యేను దాతలు శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు దిలీప్‌రాజ్, దాతలు సంతోశ్, మమత, శివకవి, లింగమ్మ, చంద్రయ్య, సందీప్, ప్రత్యూష, రాఘవేందర్, శ్రీలత, వంశీ, వరప్రసాద్‌రెడ్డి, నవీన్, సన్నిరెడ్డి, వంశీకృష్ణారెడ్డి, రిషికేశ్‌రెడ్డి, హంసిక, మల్లికార్జున్, తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ కేంద్రంలో సమస్యల తిష్ట

వర్ధన్నపేట నియోజకవర్గ కేంద్రంలో సమస్యలు తిష్ట వేశాయని తెలంగాణ అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు కంజర్ల మహేశ్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలోని బృందం స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజును ఆదివారం కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు అసంపూర్తిగా ఉన్నాయని, ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిర్మించాల్సి ఉందని తెలిపారు. పట్టణాన్ని రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ఉన్నతీకరించాలని , మరో ఎస్‌బీఐ శాఖ ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు లేవన్నారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయడంతోపాటు ప్రభుత్వ డిగ్రీ కళాశాల భవనం నిర్మించాలని, ఏరియా ఆస్పత్రికి అనుభవజ్ఞుడైన సూపరింటెండెంట్‌ను నియమించాలని, పట్టణంలోని భూములను గుర్తించి ప్రభుత్వ కార్యాలయాలకు భవనాలు నిర్మించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నర్సయ్య, నాయకులు జంగిలి భాస్కర్, వల్లందాసు కుమార్, వివేక్, రాజు, గణేశ్, మంజునాథ్, రమేశ్, ప్రభాకర్ పాల్గొన్నారు.

సర్వేలో నిబంధనలు తప్పనిసరి

- అదనపు కలెక్టర్ సంధ్యారాణి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

పర్వతగిరి : సర్వే సందర్భంగా వివరాల నమోదులో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ సంధ్యారాణి కోరారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సర్వే బృందాలతో ఆదివారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలకు అర్హులను ఎంపిక చేసే క్రమంలో సర్వేలో సరైన వివరాలు నమోదు చేయాలని సూచించారు. వివరాల నమోదులో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. తొలుత సర్వే తీరును అడిగి తెలుసుకున్నారు. అర్హులకు పథకాలు అందేలా సర్వేను చేయాలని తెలిపారు. నిర్లక్ష్యం చేయొద్దని స్పష్టం చేశారు. సర్వేకు వచ్చే బృందాలకు ప్రజలకు సహకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీపీఓ కల్పన, తహసీల్దార్ వెంకటస్వామి, ఎంపీడీఓ శంకర్‌నాయక్, ఏఓ ప్రశాంత్, ఎంపీఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

'బీసీ-ఏ' ఉద్యమానికి మద్దతివ్వండి

చెన్నారావుపేట : ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లో చేర్చాలని డిమాండ్ చేస్తూ నిర్వహించనున్న ఉద్యమకానికి మద్దతివ్వాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణను ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (మెపా) వ్యవస్థాపక అధ్యక్షుడు పులి దేవేందర్ కోరారు. ఈ మేరకు మంద కృష్ణను దేవేందర్ ఆదివారం హనుమకొండలో ఆదివారం కలిసి మాట్లాడారు. తొలుత రాజకీయ అంశాలపై చర్చించారు. ముదిరాజ్ కులస్తులను బీసీ'ఏ'లో చేర్చడం వల్ల కలిగే ప్రయోజనాలపై చర్చించారు. విద్యార్థులు నష్టపోతున్న విషయాన్ని ప్రస్తావించారు. ఉద్యమంపై మంద కృష్ణ సానుకూలంగా స్పందించడంతో ఆయనను దేవేందర్ మద్దతు కోరారు.

డ్రెయినేజీలపై సామగ్రి తొలగించాలి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎస్సై గోవర్ధన్

నల్లబెల్లి : వ్యాపారులు డ్రెయినేజీలపై ఏర్పాటు చేసిన సామగ్రిని వెంటనే తొలగించాలని స్థానిక ఎస్సై గోవర్ధన్ స్పష్టం చేశారు. మండల కేంద్రంలో రోడ్లపై ఉన్న డ్రెయినేజీలపై సామాన్లు ఏర్పాటు చేసి విక్రయిస్తున్న వ్యాపారులకు ఆదివారం ఆయన కౌన్సిలింగ్ చేశారు. షాపుల ఎదుట వాహనాలు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాలు తప్పకుండా ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. అనంతరం షాపుల ఎదుట నిలిపి ఉన్న పలు వాహనాలపై జరిమానా విధించారు. ఆయన వెంట పోలీస్ కానిస్టేబుళ్లు వేణు, విజయ్, రేవంత్, తదితరులున్నారు.

మల్లన్న ఆలయంలో భక్తుల సందడి

ఐనవోలు : మల్లిఖార్జున స్వామి ఆలయంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. వారాంతపు జాతరలో భాగంగా తొలి ఆదివారం అవడంతో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం ఒగ్గు పూజారుల మేలుకొలుపుతో ఆరంభం కాగా నిత్య కైంకర్యాలు శైవ ఆగమ పద్ధతిలో అర్చకులు నిర్వహించారు. భక్తులు ఒగ్గు పూజారులతో పట్నాలు వేసి వారి పితృదేవతలను పూజించారు. బోనం వండి అమ్మవారికి సమర్పించి కోడెను కట్టి, శావతీసి (రథ సేవ) మొక్కులు చెల్లించుకున్నారు. కొందరు ఒడి బియ్యం, సారె సమర్పించారు. భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఈఓ తెలిపారు.